క్లుప్తంగా

ఎమ్మెల్సీ ఎన్నికల్లో 'అలుగుబెల్లి'ని గెలిపించండి

జనగామ : ఖమ్మం-వరంగల్-నల్లగొండ ఉపాధ్యాయ నియోజకవర్గ ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోటీ చేస్తున్న అలుగుబెల్లి నర్సిరెడ్డిని గెలిపించాలని మాజీ ఎమ్మెల్యే సీహెచ్.రాజారెడ్డి కోరారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ నిస్వార్థపరులు నర్సి రెడ్డికి ఉపాధ్యాయులు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. ఉపాధ్యాయ, ఉద్యోగ సమస్యలతో పాటు, పీడిత ప్రజల సమస్యల పరిష్కారం కోసం ఆయనకు అండగా నిలువాలన్నారు.

లక్ష్మీనరసింహస్వామికి ప్రత్యేక పూజలు



రఘునాథపల్లి: మండలంలోని ఇబ్రహీంపూర్ శివారులోని లక్ష్మీనరసింహస్వామి గుట్ట వద్ద స్వామివారికి ఆదివారం గ్రామస్తులు ప్రత్యేక పూజలు చేశారు. శ్రీలక్ష్మి సహకార సంఘం ఆధ్వర్యంలో పాడిపంటలతో చల్లంగా ఉండాలని స్వామి వారికి మొక్కుకున్నారు. గుడి అభివృద్ధికి కృషి చేస్తామని వారు పేర్కొన్నారు. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో సహకార సంఘం అధ్యక్ష, కార్యదర్శులు పోకల శ్రీనివాస్, బెజుగం కృష్ణ, మాజీ సర్పంచ్ కాసర్ల లక్ష్మయ్య, దొరగొల్ల గట్టయ్య, పబ్బ శేఖర్, పండుగ మల్లేష్, పోతులూరి, రామదాస్, పులి రాజు, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

ఎల్‌ఓసీ అందజేత



జనగామ : జిల్లా కేంద్రంలోని 15వ వార్డుకు చెందిన రాచమల్ల మహేందర్‌కు మెరుగైన వైద్యం కోసం ప్రభుత్వం అందించిన రూ.1.25 లక్షల ఎల్‌ఓసీని కాంగ్రెస్ పార్టీ రాష్ట్రనాయకుడు నాగపురి కిరణ్ కుమార్‌గౌడ్ ఆదివారం అందించారు. మహేందర్ కుడికాలు ప్రమాదవశాత్తు కోల్పోగా, కృత్రిమ కాలు ఏర్పాటు కోసం ప్రభుత్వం నుంచి సాయం కోసం అభ్యర్థించారు. వెంటనే స్పందించిన బీసీ సంక్షేమ, రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్‌ను కలిసి ఎల్‌ఓసీని తీసుకొచ్చి కుటుంబ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో మహేందర్, గిరి, భాగ్యలక్ష్మి, జక్కుల వేణు, సమ్మయ్య, అజాం, మార్గం రవి, జయా మల్లేష్, పాషా, వెంకట్, రాజిరెడ్డి, ఉదయ్ పాల్గొన్నారు.

చెరువుల్లో నీటిని నింపాలి



చిల్పూరు : చెక్ డ్యాం దగ్గరి నుంచి చిన్నపెండ్యాల గ్రామంలోని రెండు చెరువులను నీటితో నింపేలా చూడాలంటూ ఆదివారం గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఇల్లందుల యాదగిరి, మాజీ సర్పంచ్ తాళ్లపల్లి సమ్మయ్య ఆధ్వర్యంలో ఎమ్మెల్యే కడియం శ్రీహరిని హనుమకొండలో కలిసి విన్నవించారు. ఈ సందర్భంగా త్వరలో సమస్య పరిష్కరిస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చినట్లు తెలిపారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో తాళ్లపల్లి సంపత్‌కుమార్, బుచ్చయ్య, నీల రాజు, శాగ కుమారస్వామి, యాదవరెడ్డి, ధన్‌కోటి తదితరులు ఉన్నారు.

ఆర్థిక సాయం

బచ్చన్నపేట : మండలకేంద్రంలోని నిరుపేద కుటుంబానికి చెందిన పేదింటి ఆడబిడ్డ పెళ్లికి ఆదివారం ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి ఆర్థిక సాయం అందజేశారు. బీఆర్‌ఎస్ నాయకుల సమాచారం మేరకు తన వంతు సాయంగా రూ.5000 పంపించారు. బీఆర్‌ఎస్ నాయకులు అల్వాల మధు, కరుణ దంపతులు కొన్నేళ్ల క్రితం మృతి చెందగా వారి కుమార్తె వివాహానికి ఎమ్మెల్యే ఆర్థిక సాయం అందించారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు

చిల్పూరు : మండలంలోని లింగంపల్లి గ్రామపరిధిలోని కొమ్ముగుట్ట వద్ద ఆదివారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్ర గాయాలయ్యాయి. 108 పైలట్ అమర్‌నాథ్, ఈఎంటీ రాజేంద్రప్రసాద్‌లు అందించిన కథన ప్రకారం.. పీచరకు చెందిన వేముల కైలు తన ద్విచక్ర వాహనంపై లింగంపల్లిలోని ఓ కార్యక్రమానికి వెళ్తున్నాడు. కొమ్ముగుట్ట సమీపంలో బొలేరో వాహనం ఢీకొనడంతో తలకు తీవ్రంగా గాయమైంది. 108 వాహనంలో ఎంజీఎం ఆస్పత్రికి తరలించినట్లు తెలిపారు.

తూము నిర్మాణం ఎప్పుడో?

- మూడేళ్లుగా ఎదురుచూపులు
- అలంకారప్రాయంగా ఉప్పుగల్లు రిజర్వాయర్
- తూము నిర్మాణంతో 200 ఎకరాలకు అందనున్న సాగునీరు



నిండుకుండలా ఉప్పుగల్లు రిజర్వాయర్

జఫర్‌గఢ్ : అన్నీ ఉన్న అల్లుడి నోట్లో శని అన్నట్లుగా ఉప్పుగల్లు గ్రామ రైతుల పరిస్థితి తయారైంది. పైన నిండుకుండలా రిజర్వాయర్ ఉన్న పక్కన తూమును నిర్మించకపోవడంతో పంట పొలాలకు చుక్కనీరు అందడం లేదు. దీంతో మూడేళ్ల నుంచి సాగునీటికి రైతులు అవస్థలు పడుతున్నా సంబంధిత అధికారులు, పాలకులు ఏ మాత్రం పట్టించుకోకపోవడంతో స్థానికుల నుంచి తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఇదే గ్రామశివారులో చౌడు చెరువును ఆనుకొని 915 ఎకరాల్లో 0. 35 టీఎంసీల సామర్థ్యం గల ఉప్పుగల్లు రిజర్వాయర్‌ను నిర్మించారు. ఈ రిజర్వాయర్ పూర్తయి మూడేళ్లవుతున్నా దీని ద్వారా ఇప్పటి వరకు రైతులకు సంబంధించిన పంట పొలాలకు చుక్క నీరు కూడా అందడం లేదు. దీంతో రిజర్వాయర్ అలంకారప్రాయంగానే దర్శనమిస్తున్నది. ప్రస్తుతం రిజర్వాయర్‌లో నీరు నిండుగా ఉన్నప్పటికీ అటు కాల్వల పనులు పూర్తి కాక మరోవైపు తూమును ఏర్పాటు చేయకపోవడంతో ఇతర గ్రామాల రైతులకు సాగునీరు అందించడం లేదు. కనీసం ఉప్పుగల్లు రైతులకు కూడా నీరందని పరిస్థితి నెలకొంది. రిజర్వాయర్ నిర్మాణంతో పాటు తూమును ఏర్పాటు చేసే విషయంలో సంబంధిత అధికారులు తప్పిదాలు చేయడం వల్లనే గ్రామ రైతులకు ఈ దుస్థితి పట్టిందని స్థానికులు పేర్కొంటున్నారు. రిజర్వాయర్ పక్కన దొండ్ల వద్ద తూమును ఏర్పాటు చేయడంతో గ్రామ రైతులకు చెందిన సుమారు 150 ఎకరాలతో పాటు పక్కన ఉన్న తమ్మడపల్లి (ఐ) గ్రామ రైతులకు చెందిన మరో 50 ఎకరాలకు సాగునీరు అందే అవకాశం ఉంది. కానీ అధికారులు నిర్లక్ష్యం వల్ల ఇప్పటి వరకు సాగునీరు అందకుండా పోయింది. ఇప్పటికైనా ప్రభుత్వం, సంబంధిత అధికారులు స్పందించి తూమును ఏర్పాటు చేసి పంటలకు సాగునీరు అందించి ఆదుకోవాలని రైతుల కోరుతున్నారు.

తూము ద్వారా నీరు అందించాలి



ఉప్పుగల్లులో రిజర్వాయర్ నిర్మించి మూడేళ్లవుతున్నా ఇప్పటి వరకు తూమును నిర్మించలేదు. దీంతో పంట పొలాలకు చుక్కనీరు అందక రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. తూము నిర్మాణ విషయంలో అనేక మార్లు సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఎవరూ పట్టించుకోవడం లేదు.

– పులి ధనుంజయగౌడ్ , ఉప్పుగల్లు

రిజర్వాయర్ ఉన్నా నీరందడం లేదు



రిజర్వాయర్‌లో నీరు నిండుగా ఉన్న తూము లేకపోవడంతో రైతుల పంట పొలాలకు నీరు అందడం లేదు. రిజర్వాయర్ నిర్మాణంతో పాటు అధికారులు తూమును ఏర్పాటు చేయాలి. సంబంధిత అధికారులు రైతుల గోడును పట్టించుకొని వెంటనే తూమును ఏర్పాటు చేసి తమ పంట పొలాలకు సాగునీరు అందించాలి.

– దామెర రాజు, రైతు

పంటలు ఎండిపోకుండా చర్యలు చేపట్టండి

- మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు



పాలకుర్తి : రైతుల సమస్యలపై అధికారితో మాట్లాడుతున్న మాజీ మంత్రి దయాకర్‌రావు

దేవరుప్పుల : మండలంలోని పలు గ్రామాల్లో సాగు చేసిన వరి పంటలు ఎండిపోకుండా ప్రభుత్వం నివారణ చర్యలు చేపట్టాలని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు డిమాండ్ చేశారు. ఆదివారం పలు గ్రామాల రైతుల విజ్ఞప్తి మేరకు స్పందించిన ఆయన నీటిపారుదల శాఖ జనగామ అధికారులతో ఫోన్‌లో మాట్లాడి నవాబుపేట, స్టేషన్‌ఘన్‌పూర్ రిజర్వాయర్ల ద్వారా సాగునీటి సరఫరాకు సత్వరమే చర్యలు తీసుకొని రైతులను ఆదుకోవాలన్నారు. అన్నదాతలను రోడ్డు పడకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని పునరుద్ఘాటించారు.

పాలకుర్తి : మండలంలోని శాతపురం గ్రామం ద్వారా వెళ్లే 4 ఎల్ కాల్వలో సాగునీరు రాకపోవడంతో తమకు వచ్చే ఇబ్బందులను రైతుల ద్వారా మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు తెలుసుకుని ఉన్నతాధికారులతో ఫోన్‌లో మాట్లాడారు. ఆదివారం అటు వైపు వెళ్తున్న మాజీ మంత్రికి రైతులు తమ సమస్యను వివరించారు. పై అధికారులతో ఫోన్‌లో మాట్లాడి రెండు మూడు రోజుల్లో నీరు వస్తుందని తెలిపారు. ఇ కెనాల్ ద్వారా వచ్చే నీటితో సుమారు ఒక వెయ్యి ఎకరాలు పంట సాగుతుందని అన్నారు. తక్షణమే ప్రభుత్వం స్పందించి రైతుల సమస్యను తీర్చాలని అన్నారు. ఆయన వెంట బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు పసునూరి నవీన్, కార్యదర్శి మాచర్ల ఎల్లయ్య, రైతులు పాల్గొన్నారు.

టోర్నమెంట్‌కు రావాలని ఆహ్వానం



ఎమ్మెల్యే కడియం శ్రీహరిని ఆహ్వానిస్తున్న యూత్ బాధ్యులు

స్టేషన్‌ఘన్‌పూర్ : మండలంలోని ఇప్పగూడెంలో యూత్ ఆధ్వర్యంలో ఈనెల 25 నుంచి నిర్వహించనున్న ఉమ్మడి వరంగల్ జిల్లాస్థాయి క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభోత్సవానికి రావాలని కోరుతూ యూత్ బాధ్యులు ఆదివారం ఎమ్మెల్యే కడియం శ్రీహరిని హనుమకొండలోని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి ఆహ్వానించారు. అనంతరం వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్యకు సంబంధిత కరపత్రాలు అందించి పోటీల ప్రారంభోత్సవానికి రావాలని వారు ఆహ్వానించారు. అదే విధంగా స్థానిక బీఆర్‌ఎస్ పార్టీ కార్యాలయం వద్ద మాజీ ఎమ్మెల్యే డాక్టర్ తాటికొండ రాజయ్యను కలిసి పోటీలకు రావాల్సిందిగా కోరారు. కార్యక్రమంలో యూత్ బాధ్యులు, ఆర్గనైజర్స్ బొంకూరి మహేష్, మంద మహేందర్, బొంకూరి దయాకర్, మంద రాకేష్, ఐత అజయ్, జీడి మోష తదితరులు పాల్గొన్నారు.

ప్రజల బాగు కోసమే పోలీస్ కళాజాత

- ఎస్సై సిరిపురం నవీన్‌కుమార్



మాట్లాడుతున్న ఎస్సై నవీన్‌కుమార్

చిల్పూరు : ప్రజలందరి బాగుకోసమే జాగృతి పోలీస్ కళాజాత ఏర్పాటు ఉద్దేశ్యమని, ఈ కళాజాత చూశాక ప్రతీ ఒక్కరిలో మార్పు రావాలని కోరుకుంటున్నామని ఎస్సై సిరిపురం నవీన్‌కుమార్ అన్నారు. మండలంలోని చిన్నపెండ్యాలలో శనివారం రాత్రి వరంగల్ సీపీ ఆదేశాల మేరకు జాగృతి పోలీస్ కళా బృందంచే చదువు, రోడ్డు ప్రమాదాలు, డయల్100, బాల్య వివాహాలు, బాలకార్మికులు, హ్యూమన్ ట్రాఫికింగ్, భరోసా, సీసీ కెమెరాల ఏర్పాటు, గుట్కా, గంజాయి, డ్రగ్స్ వలన యువతకు కలిగే నష్టాలపై అర్థమయ్యే రీతిలో కళాకారులు వివరించారు. కార్యక్రమంలో కళాబృందం ఇన్‌చార్జ్ నాగమణి, సభ్యులు విలియం, వెంకటేశ్వర్లు, రత్నయ్య, శ్రీనివాస్, నారాయణ, విక్రమ్‌రాజు, చిరంజీవి గ్రామస్తు పాల్గొన్నారు.

పేదలకు సేవ చేయడంలోనే సంతృప్తి



బచ్చన్నపేట : పేదలకు సాయం అందించడంలో ఉన్న సంతృప్తి కోట్ల ఆస్తి ఉన్నా కలుగదని సామాజిక సేవా కార్యకర్త జంగిటి విద్యానాథ్ అన్నారు. మండలకేంద్రానికి చెందిన అల్వాల మధు, కరుణ దంపతుల కుమార్తె వివాహం ఆదివారం జరగగా విద్యానాథ్ రూ.10 వేల ఆర్థిక సాయం అందించారు.ఎల్లయ్య, మహాత్మాచారి, రాజశేఖర్, నర్సింగరావు, రాజయ్య, బాలరాజు, సుభాష్, పాల్గొన్నారు.

పాండురంగం పోరాటం మరువలేనిది



పాండురంగం చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న సీపీఐ, సీపీఎం నాయకులు

జనగామ రూరల్ : వీర తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో అమరజీవి పొట్టబత్తిని పాండురంగం పోరాట స్ఫూర్తి మరువలేనిదని సీపీఐ, సీపీఎం జిల్లా కార్యదర్శులు సిహెచ్.రాజారెడ్డి, మోకు కనకారెడ్డి పేర్కొన్నారు. పాండురంగం 27వ వర్ధంతి సందర్భంగా పట్టణంలోని శ్రీనివాస కాలనీలోని వారి కుమారుడైన భాస్కర్ ఇంట్లో పాండురంగం వర్ధంతిని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా పార్టీల నాయకులు పాండురంగం చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ ఆనాడు భూమి కోసం భుక్తి కోసం వెట్టిచాకిరి విముక్తి కోసం జనగామ కేంద్రంగా సాగిన వీరోచిత పోరాటంలో పాండురంగం నిర్వహించిన పోరాట స్ఫూర్తి అమోఘమైందన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు బూడిద గోపి, చింతకింది అరుణ, గుండె కనకయ్య, రిటైర్డ్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నెర్రెలు బారుతున్న చెరువులు.. ఎండుతున్న పంటలు



ఎండిపోయిన పెద్దపహాడ్ పెరుమాళ్ల చెరువు

గోదావరి జలాల తరలింపులో అధికార యంత్రాంగం నిర్లక్ష్యంతో చెరువులన్నీ నెర్రెలు బారుతూ భూగర్భ జలాలు అడుగంటుతుంటే.. యాసంగి సీజన్‌లో సాగు చేసిన వరి పంటలు ఎండిపోతున్నాయి. జనగామ మండలం పెద్దపహాడ్, ఎర్రగుంటతండా సమీప ప్రాంతాల చెరువులన్నీ ఎండిపోవడంతో వందలాది ఎకరాల వరికి పెనుప్రమాదం ముంచుకొస్తుంది. పెద్దపహాడ్‌లోని పెరుమాళ్ల చెరువు, ఏనె చెరువు, కొత్త చెరువు, ఎర్రగుంట తండా చెరువులు నాలుగింట్లో నీరంతా ఇంకిపోయి మోడు బారి కనిపిస్తున్నాయి. గోదావరి జలాలు తరలించి రైతులను ఆదుకోవాలని యువ రైతు గుండ్లపల్లి రవి విజ్ఞప్తి చేశారు.

– జనగామ

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



బచ్చన్నపేట : ఆత్మీయ సమ్మేళనంలో పూర్వవిద్యార్థులు, ఉపాధ్యాయులు



దేవరుప్పుల: చిన్నమడూరు హైస్కూల్‌లో..

బచ్చన్నపేట : స్థానిక జిల్లా ప్రజా పరిషత్ సెకండరీ పాఠశాలలో 2005-06 బ్యాచ్ పదో తరగతికి చెందిన పూర్వ విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనం స్థానిక శ్రీనివాస్ గార్డెన్స్‌లో ఆదివారం ఘనంగా నిర్వహించారు. 19 ఏళ్ల తర్వాత తాము చదువుకున్న పాఠశాలలో విద్యార్థులందరూ కలుసుకుని అప్పటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. ముందుగా విద్యాబుద్ధులు నేర్పిన ఉపాధ్యాయులు శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు మాట్లాడుతూ క్రమశిక్షణతోనే జీవితంలో ఉన్నత శిఖరాలు అధిరోహించవచ్చన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు మూర్తి, మురళి, రాజేందర్, హిమబిందు, పృథ్వీరాజ్, ఆంజనేయులు, చంద్రశేఖర్‌రావు, బాలకిషన్, వెంకటేశ్వర్లు, సురేష్‌బాబు, విద్యార్థులు, పాల్గొన్నారు.

చిన్నమడూరులో ఆత్మీయ సమ్మేళనం

దేవరుప్పుల : మండలంలోని చిన్నమడూరు హైస్కూల్ 1994-95 పదో తరగతి విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనాన్ని జరుపుకున్నారు. రెండు దశాబ్దాల కిందట బాల్య జీవితాన్ని అనుభవించిన పూర్వ విద్యార్థులు నాటి మధుర స్మృతులను నెమరువేసుకుంటూ ఆత్మీయ స్నేహాన్ని పంచుకున్నారు. సహచరులు ఆయా రంగాల్లో రాణించిన పురోగతి , జీవన స్థితిగతులపై చర్చించుకున్నారు. అనంతరం విద్యాబోధన చేసిన నాటి గురువులు సదానందం, యాదగిరిస్వామి, ఆగయ్య, కృష్ణమూర్తి, ఆనంద్‌ప్రసాద్ తదితరులను ఘనంగా సన్మానించి జ్ఞాపికలను అందజేశారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు ఉమేష్, శ్రీధర్, చిన్న, పెద్ద అబ్దుల్ మజీద్, రేణుక, పద్మ, మంగ, హైమావతి, రాము తదితరులు పాల్గొన్నారు.

బ్రహ్మోత్సవాలకు ఏర్పాట్లు పూర్తి

బచ్చన్నపేట : మండలంలోని కొడవటూరు సిద్ధేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు నేటి (సోమవారం) నుంచి ప్రారంభం కానున్నాయి. ఆలయ కమిటీ చైర్మన్ ఆముదాల మల్లారెడ్డి ఆధ్వర్యంలో ఆలయ ఏఈ చిందం వంశీ పర్యవేక్షణలో నాలుగు రోజుల పాటు ఉత్సవాలు కనులపండుగగా జరగనున్నాయి. ఆలయ ప్రధాన అర్చకులు ఓంనమఃశివాయ ఆధ్వర్యంలో సోమవారం ఉదయం గంగపూజతో ఉత్సవాలు ప్రారంభమవుతాయని ఏఈ తెలిపారు. గంగపూజ, రిత్వీకరణం, ఆవాహన దేవతాపూజ, పంచామృత శతరుద్రాభిషేకం, మంత్రపుష్పం, తీర్థప్రసాదం వితరణ, సాయంత్రం శతరుద్రాభిషేకం, మంగళహారతి, మంత్రపుష్పం, తీర్థప్రసాద కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని ఆలయ కమిటీ చైర్మన్ మల్లారెడ్డి తెలిపారు. కార్యక్రమంలో డైరెక్టర్లు నిమ్మ కరుణాకర్‌రెడ్డి, మంతపురి రాములు, తిరుపతిరెడ్డి, బాల భాస్కర్, కీసరి రమేష్, సత్యనారాయణ, శివరాములు, శ్రీనివాస్‌రెడ్డి, వెంకటయ్య, భిక్షపతి, రాజయ్య, రామకృష్ణ, అర్చకులు సదాశివుడు, మహాశివుడు, సంగమేశ్వర్, సిబ్బంది పాల్గొన్నారు.

జాతర నిర్వహణకు పటిష్ట ఏర్పాట్లు

- ధర్మసాగర్ సీఐ ప్రవీణ్‌కుమార్



కోనేరును పరిశీలిస్తున్న సీఐ ప్రవీణ్‌కుమార్

వేలేరు : మండలంలోని మల్లికుదుర్ల శివారులో గల గట్టు మల్లికార్జునస్వామి ఆలయంలో మహాశివరాత్రి సందర్భంగా నిర్వహించే జాతరకు పటిష్ట ఏర్పాట్లు చేస్తున్నట్లు ధర్మసాగర్ సీఐ ప్రవీణ్‌కుమార్ తెలిపారు. ముందుగా స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. జాతరకు అధిక సంఖ్యలో భక్తులు వచ్చే అవకాశం ఉన్నందున తాగునీరు, వైద్య సదుపాయం తదితర ఏర్పాట్లను పరిశీలించారు. జాతరలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు అప్రమత్తంగా ఉండాలని, గుట్టపైన ఉన్న కోనేరు వద్ద బందోబస్తు ఏర్పాటు చేయాలని ఎస్సై సురేశ్‌కు సూచించారు. ఆయన వెంట ఈఓ అద్దంకి నాగేశ్వరరావు, పోలీస్ సిబ్బంది తదితరులు ఉన్నారు.

మెరుగైన సేవలందించాలి

కొడకండ్ల : ప్రజలకు అందుబాటులో ఉంటూ మెరుగైన సేవలందించాలని మండల కాంగ్రెస్ అధ్యక్షుడు ధరావత్ సురేష్‌నాయక్ అన్నారు. ఆదివారం మండలంలోని వెలిశాలలో బానోత్ సతీశ్ ఏర్పాటు చేసిన హైస్పీడ్ ఇంటర్నెట్ కేఫ్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆన్‌లైన్ సేవలను వినియోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో రవీందర్, మహేష్, భిక్షపతి, యాకూబ్, వెంకన్న, హరగోపాల్, వీర్యానాయక్, రవిందర్, శ్రీకాంత్, ఉప్పలయ్య, పాల్గొన్నారు.

ప్రశాంతంగా గురుకుల ప్రవేశ పరీక్ష



జఫర్‌గఢ్ : పరీక్షకు హాజరైన విద్యార్థులు

కొడకండ్ల/జఫర్‌గఢ్ : గురుకులాల్లో ఐదో తరగతిలో ప్రవేశం కోసం ఆదివారం నిర్వహించిన ప్రవేశ పరీక్ష ప్రశాంతంగా జరిగింది. కొడకండ్ల టీజీఆర్ఎస్‌జేసీలో నిర్వహించిన ప్రవేశ పరీక్షకు 116 మంది విద్యార్థులకు గాను 115 మంది హాజరైనట్లు చీఫ్ సూపరిండెంట్ దిలీప్‌కుమార్ తెలిపారు. జఫర్‌గఢ్ మండలంలో మొత్తం 236 మంది విద్యార్థులకు గాను 228 మంది విద్యార్థులు హాజరయ్యారు.

ప్రశ్నించే గొంతుకను మండలికి పంపించాలి



మాట్లాడుతున్న గోపాల్‌రెడ్డి

తొర్రూరు: ఉపాధ్యాయ సమస్యలపై ప్రశ్నించే గొంతుకను మండలికి పంపించాలని టీచర్ ఎమ్మెల్సీ అభ్యర్థి పన్నాల గోపాల్‌రెడ్డి తెలిపారు. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలపై డివిజన్ కేంద్రంలో ఆదివారం సమావేశం నిర్వహించారు. ఉపాధ్యాయ సమస్యలు పరిష్కరించేలా మండలిలో ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకువస్తానన్నారు. సీపీఎస్ రద్దు, నోషనల్ ఇంక్రిమెంట్ల మంజూరుకు కృషి చేస్తానని తెలిపారు. ఉపాధ్యాయ ఉద్యమంలో సుదీర్ఘకాలంగా భాగంగా ఉన్న తనకు ఎమ్మెల్సీగా అవకాశం కల్పించాలన్నారు. టీజేఎస్ అధ్యక్షుడు, ప్రొఫెసర్ కోదండరాం మద్దతు తనకు ఉందని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు గుండెబోయిన నాగేశ్వర్‌రావు యాదవ్, వంగాల వెంకట్‌రెడ్డి, పాల నరేష్ తదితరులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ విగ్రహం ఏర్పాటుకు భూమిపూజ



భూమిపూజ చేస్తున్న దళితులు, గ్రామస్తులు

తరిగొప్పుల : మండలంలోని అబ్దుల్‌నాగారంలో దుర్గమ్మగుడి ప్రాంతంలో రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహం ఏర్పాటుకు గ్రామస్తులు ఆది వారం భూమి పూజ చేశారు. అంబేడ్కర్ అసోసియేషన్ అధ్యక్షుడు కాత బాలయ్య ఆధ్వర్యంలో దళితులు, గ్రామస్తులు భూమిపూజ నిర్వహించారు. కార్యక్రమంలో చింతల ఎల్లయ్య, రమేష్, బాబు, కాత బాలయ్య ,సందీప్, పరుశరాములు, బాలకిష్టయ్య, వెంకన్న, ఆనందం, విజయ,భోగ శ్రీను, రాజు రాజేశ్వర్‌గౌడ్, సంపత్, ఆనందం, రాములు, సంపత్, రమేశ్ పాల్గొన్నారు.